ముస్లింల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం

- ఘట్‌కేసర్, కీసరలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం
- పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, మైనార్టీలు

కీసర మండలం యాద్గార్‌పల్లిలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో వారి ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్‌లో నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ముస్లింలు

కీసర/ఘట్‌కేసర్,నవంబర్24: ముస్లింల సంక్షేమానికి గత తొమ్మిదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్,కీసర మండలం యాద్గార్‌పల్లిలోని శుభం గార్డెన్‌లో ముస్లింల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ముస్లింల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రంజాన్ పండుగకు కొత్తబట్టలు అందించి వారిని ఆదుకున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే అన్ని కార్యక్రమాలలో ముస్లింలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని వివరించారు. ముస్లింలతో పాటు, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు.అభివృద్ధితో పాటు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించారని వివరించారు.

ప్రతిపక్షాలు ఓట్ల కోసమే పనిచేస్తాయి..

ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఓట్ల కోసమే పనిచేస్తాయని,బీఆర్ఎస్ మాత్రం ఎల్లప్పుడు వారి సంక్షేమం కోసం పనిచేస్తుందని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్రంలో ఏ విధంగా అభివృద్ధి జరిగిందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రజలు బీఆర్ఎస్‌కే ఓట్లు వేసి మరోసారి సీఎం కేసీఆర్‌ను,మేడ్చల్‌లో నన్ను బలపర్చాలని నిర్ణయించుకున్నారని వివరించారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలను సంపూర్ణంగా అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు.ఈ ప్రాంతంలోని పోచారం,ఘట్‌కేసర్ మున్సిపాలిటీలు పుర్తి స్థాయిలో అభివృద్ధిని సాధించాలన్నారు. ఇక్కడి ప్రజలకు ఏది తక్కువైనా చైర్మన్,కౌన్సిలర్లు,బీఆర్ఎస్ నాయకులు కొట్లాడి సాధించుకుంటున్నారని అన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు పడిగెం వెంకటేశ్వరావు, నాయకులు ముల్లి పావనీ జంగయ్య యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్ గౌడ్, హరిశంకర్, సిరాజ్, కీసర మండల కో-ఆప్షన్ సభ్యులు ఎం.డీ. బషారత్ ఆలీ, మైనార్టీలు ఎం.డీ నర్సత్, ఎం.డీ హాఫీజ్, ఎం.డీ సాజీద్, రాఫ్, ఫారీద్, ఎం.డీ. ఆరీఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల అత్యుత్సాహం..

కొండను తవ్వి ఎలుకను పట్టిన అధికారులు

సంజీవరెడ్డికి మద్దతుగా అతని ఇంటి వద్ద బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు

బోడుప్పల్, నవంబర్24: కాంగ్రెస్ నేతల అత్యుత్సాహం అధికారులను పరుగులు పెట్టించింది. మంత్రి మల్లారెడ్డి ప్రధాన అనుచరుడు, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి భారీగా తన ఇంట్లో డబ్బులు డంప్ చేశారని కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఉదయం 10గంటలకు ఎలక్షన్స్ అధికారులు, ఐటీ అధికారులు, పోలీసులు సంజీవరెడ్డి ఇంటింకి చేరుకున్నారు. 7 గంటల పాటు సంజీవరెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సంజీవరెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయన ఇంటి ఎదుట బైఠాయించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోదాల అనంతరం రూ.50వేలు అద్దెకు సంబంధించిన డబ్బులు, 2.5లీటర్ల మద్యం తప్పా ఏమిలేవని అధికారులు స్పష్టం చేయడంతో గందరగోళానికి తెరపడింది. ఇలాంటి తప్పుడు ఫిర్యాదు ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

ఓటమిని జీర్ణించుకోలేకనే నాపై ఆరోపణలు: మంద

బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలువబోతున్న తరుణంలో కాంగ్రెస్ నేతలు ఓటమిని జీర్ణించుకోలేక నాపై అసత్య అరోపణలు చేస్తున్నారని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రచారాన్ని అడ్డుకోవాలని నా ఇంట్లో భారీగా డబ్బులు ఉన్నాయని ఎలక్షన్ కమిషన్ అధికారులకు, ఐటీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో 7గంటలపాటు ఎక్కడకు వెళ్లకుండా తనను నిలువరించారని, చివరకు ఇంట్లో ఏమీ లేకపోవడంతో తప్పుడు ఫిర్యాదుగా భావించి అధికారులు వెనుదిరిగారని తెలిపారు. తన పేరును, మంత్రి మల్లారెడ్డిని అప్రతిష్టపాలు చేయడానికే ప్రతిపక్షనాయకులు వ్యవహరిస్తున్నారని, ఎవరెన్ని కుట్రలు చేసిన మల్లారెడ్డి గెలుపును ఆపలేరని సంజీవరెడ్డి పేర్కొన్నారు.

శామీర్‌పేట్‌లో గంజాయి పట్టివేత

శామీర్‌పేట్, నవంబర్ 24 : రెండు కార్లలో తరలిస్తున్న గంజాయిని శామీర్‌పేట్ పోలీసుల పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతం లో ఓఆర్ఆర్ టోల్ గేట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా రెండు కార్లలో గంజా యి పట్టుపడింది. ఒక కారులో 140 కిలోల గంజాయి 70ప్యాకెట్లలో లభించింది, మరో కారు లో 30కిలోల గంజాయి 15 ప్యాకెట్లలో లభించింది. ఇందుకు సంబంధించి రెండు కార్లలో ప్రయాణిస్తున్న మహారాష్ట్రకు చెందిన అయూబ్ షేక్ ముస్నా, సద్దాం హనీఫ్ ఖాన్, సోహెల్ అహ్మద్ ఇస్త్యాక్, హైదరాబాద్‌కు చెందిన రహీంలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి పోలీసులు గంజా యి, కార్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబర్‌లో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లు, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లను మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, అసిస్టెంట్ ఇంజినీర్ స్నేహలత, సూపరింటెండెంట్ సత్యనారాయణ శాలువ, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. -మేడ్చల్, నవంబరు 25

ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోవాలి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 24: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, ఎన్నికల సాధారణ అబ్జర్వర్లు జైన్‌తో కలిసి పరిశీంచారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ల అధికారి వంశీ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

రిజర్వ్‌లో ఉన్న బ్యాలెట్ యూనిట్ కంట్రోల్ యూనిట్ల వీవీ పాట్‌లు సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి చేశామని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో రిజర్వ్ బ్యాలట్ యూనిట్లు 47, కంట్రోల్ యూనిట్లు 155, వీవీ పాట్లు 20 సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

మల్లారెడ్డికి వీరశైవ లింగాయత్‌ల మద్దతు



కార్పొరేటర్ శారదా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డికి మద్దతు తెలుపుతున్న జవహర్‌నగర్ లింగాయత్‌లు

జవహర్‌నగర్, నవంబర్ 24: అభివృద్ధి చేస్తున్న మల్లారెడ్డికి వీరశైవ లింగాయత్‌లు సంపూర్ణ మద్దతు తెలిపారు. శుక్రవారం మంత్రి మల్లారెడ్డి నివాసంలో కార్పొరేటర్ శారదా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జవహర్‌నగర్ వీరశైవ లింగాయత్‌లు కలిశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌లకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మల్లారెడ్డి సమక్షంలో 500 మంది వీరశైవ లింగాయత్‌లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి మల్లారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వీరశైవ లింగాయత్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్, కమిటీ సభ్యులు మాలెశెట్టి, గురురాజ్, విజయ్, సంజు స్వామి, రతికాంత్, రమేశ్, శివరాజ్, అరుణ్, హన్మంత్, బద్రీ, శంకర్, రాజు, రాజ్ కుమార్, ధన్‌రాజ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ యూనివర్శిటీలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 24: సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనురాగ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ వసుధ భక్షి తెలిపారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్శిటీలో 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు-2023 సందర్భంగా అనురాగ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్-1 సహకారంతో జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ లోని 205 మంది ఉపాధ్యాయులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు

జాతీయ స్థాయికి జడ్పీహెచ్ విద్యార్థుల ప్రాజెక్టు

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులు

మేడ్చల్, నవంబరు 24 : అక్టోబరులో విప్రో సంస్థ సస్టైనబిలిటీ ఎడ్యూకేషన్ ప్రోగ్రాం ఫర్ స్కూల్స్ అనే ప్రోగ్రాంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సస్టైబిలిటీ అండ్ వేస్ట్, వాటర్, బయో డైవర్సిటీ అనే అంశంపై ప్రాజెక్టులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు తయారు చేసిన వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా హెచ్ఎం మంజుల, బయోసైన్స్ టీచర్ ముప్పాళ్ల కవిత పాజెక్టు తయారు చేసిన రచన, అమీనా, లతిత, సొనాలి, రజితలను అభినందించారు.

28న మండల పరిషత్ సమావేశం

కీసర, నవంబర్ 24: కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని కీసర ఎంపీడీవో పి. గ్యామా తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ మల్లారపు ఇందిరలక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.